
కప్పరాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఆరోగ్య ప్రాప్తిరస్తు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారు. పేదలు ఎవరూ అనారోగ్య సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్టం చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎందరో బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు.

కప్పరాడ యూపీహెచ్‌సీ సిబ్బంది సమాచారం

- రూ.1.25 కోట్లతో యూపీహెచ్‌సీ నిర్మాణం

సచివాలయాల పరిధి	07
వైద్యాధికారి	01
స్టాఫ్ నర్స్	03
ఫార్మాసిస్ట్	01
ల్యాబ్ టెక్నీషియన్	01
డేటా ఎంట్రీ ఆపరేటర్	01
ఎల్‌జీఎస్ ఆపరేటర్	01
ఏఎన్‌ఎంలు	05



వైద్య సేవల వివరాలు..

- కప్పరాడ ఆరోగ్య కేంద్రంలో రెగ్యులర్ ఓపీ సేవలతోపాటు స్పెషలిస్ట్ వైద్య సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి.
- ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాధారణ వైద్య సేవలు పొందవచ్చు.
- ప్రతి రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పెషలిస్ట్ ఓపీ సేవలు అందిస్తారు.
- ప్రతి రోజు సుమారు 105 నుంచి 135 వరకు ఓపీలు నమోదవుతాయి.
- ప్రతి రోజూ అల్ట్రా సౌండ్ స్కానింగ్ సిస్టంతో వైద్య సేవలు అందిస్తున్నారు.

స్పెషలిస్ట్ వైద్య సేవలు

- ప్రతి సోమవారం : ఎముకలు, కండరాలు
- ప్రతి మంగళవారం : శ్వాస వ్యవస్థ
- ప్రతి బుధవారం : సాధారణ శస్త్రచికిత్స (జనరల్ సర్జన్)
- ప్రతి గురువారం : జనరల్ వైద్యం
- ప్రతి శుక్రవారం : చెవి, ముక్కు, గొంతు
- ప్రతి శనివారం : చర్మ వ్యాధులు, మహిళా సంబంధిత వైద్య నిపుణులు అందుబాటులో ఉంటూ రోగులకు వైద్య సేవలందిస్తారు.

- పేదల వైద్యానికి ప్రభుత్వ భరోసా
- ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుతో ప్రజలకు మేలు
- అందుబాటులో అన్ని రకాల వైద్య సేవలు
- చెంతకే వైద్యంపై లబ్ధిదారుల హర్షం


అల్ట్రా సౌండ్ స్కానింగ్ సదుపాయం

కంచరపాలెం: పేదలు, సామాన్యుల వైద్యానికి భరోసా ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి ఆరోగ్య సేవలను తీసుకొచ్చింది. ప్రతి జీవీఎంసీ వార్డులో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(యూపీహెచ్‌సీలు) ఏర్పాటు చేసి ఉచితంగా వైద్య సేవలందిస్తోంది. టీడీపీ హయంలో ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకున్న పాపాన ఏనాడు పోలేదు. దీంతో సుదూర ప్రాంతాలకు రోగులు తరలివెళ్లి వైద్యం చేయించుకోవాల్సి వచ్చేది. పేదలు కనీసం మందులకు నోచుకునే వారు కాదు. ఇటువంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన విప్లవాత్మక కార్యక్రమాలతో ప్రజల చెంతకు వైద్య సేవలు చేరాయి.

46, 47 వార్డుల ప్రజలకు చేరువలో..

జీవీఎంసీ 46, 47 వార్డుల పరిధి కంచరపాలెం రాంజీ ఎస్టేట్‌లో సుమారు రూ.1.25 కోట్ల వ్యయంతో కప్పరాడ డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను నిర్మించారు. కొండవాలు ప్రాంతాల ప్రజల కోసం ఈ ఆరోగ్య కేంద్రంలో ఇటీవల ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను మౌలిక వసతులతోకూడిన 10 పడకలతో ఏర్పాటు చేశారు. ఆయా వార్డుల్లోని రాంజీ ఎస్టేట్, అంబేడ్కర్ ఎస్టేట్, పెదకొత్తూరు, సంజీవయ్య కాలనీ, బాపూజీనగర్, జవహర్‌లాల్‌నగర్, మధుసూదన్ నగర్, కస్తూరినగర్, శాంతినగర్ తదితర ప్రాంతాల నుంచి ప్రతి రోజూ వందల సంఖ్యలో రోగులు ఇక్కడికి వచ్చి వివిధ రకాల వైద్య ఆరోగ్య సేవలు, మందులు ఉచితంగా పొందుతున్నారు.


అన్ని రకాల వైద్య పరీక్షలకు ల్యాబ్ సిద్ధం


కప్పరాడ ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలకు తరలివచ్చిన ప్రజలు

అన్ని సదుపాయాలతో వైద్య సేవలు



గతంలో వైద్యం కోసం కేజీహెచ్ వంటి పెద్దాస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. నేడు ఆ పరిస్థితి లేదు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసింది. అన్ని సదుపాయాలతో అందుబాటులో కప్పరాడ ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉంది. సాధారణ, స్పెషలిస్ట్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆరోగ్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పొందుతున్నాం.

–ఎస్ శంకరరావు, రాంజీ ఎస్టేట్

పైసా ఖర్చు లేకుండా వైద్యం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మాలాంటి రోగులకు నాణ్యమైన వైద్య సేవలందిస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట వైద్య శిబిరాలు నిర్వహించి కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారు. సీఎం ఆలోచన పేదలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది. ఒక్క పైసా ఖర్చు లేకుండా నిపుణులతో వైద్య సేవలు, మందులు అందిస్తున్నారు.

– రామలక్ష్మి, పెదకొత్తూరు

అయ్యప్ప స్వాములకు అన్నసమారాధన


స్వాములకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కె.కె.రాజు

సీతంపేట: ఎరుమేలి అయ్యప్ప అన్నసమారాధన ట్రస్టు ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం పోర్టు ఆస్పత్రి సమీపంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు పాల్గొని అయ్యప్ప దీక్షా స్వాములకు అన్నప్రసాదం వడ్డించారు. ముందుగా పీఠంలో స్వామి వారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది మండలం పాటు ప్రతి రోజూ వేలాది మంది స్వాములకు అన్నప్రసాద వితరణ చేయడం గొప్ప విషయమని నిర్వాహకులను అభినందించారు.

‘జగనన్నకు చెబుదాం’కు నాలుగు వినతులు

కంచరపాలెం: జ్ఞానాపురం జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి నాలుగు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి, పరిశీలించారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం


జగనన్న కిట్ అందిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు


ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు

సీతమ్మధార: రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో భాగంగా సోమవారం 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో 1086110 సచివాలయం పరిధి తమిళ్ కల్యాణ మండపం ఆవరణలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనుల వివరాలు బోర్డు ప్రారంభించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు పరిచిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కొనియాడారు. 2024లో మళ్లీ ఆయనే సీఎం కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, మండల అధ్యక్షురాలు జి.వి.రమణి, ఏపీడీలు దుర్గాప్రసాద్, పద్మావతి, జేసీఎస్ మండల కన్వీనర్లు మురళీకృష్ణారెడ్డి, తాడి జగన్నాథరెడ్డి, బల్లా శ్రీనివాసరావు, లంకా భాస్కరరావు, చొక్కాకుల రామకృష్ణ, కోడూరి సుశీల, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

55వ వార్డులో ‘వై ఏపీ నీడ్స్ జగన్’

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 55వ వార్డు తాటిచెట్లపాలెంలో సోమవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి కె.కె.రాజు మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కృషిని వివరించారు. 250 సచివాలయ సిబ్బంది, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్లు కేవీఎస్ శశికళ, ఆళ్ల లీలావతి శ్రీనివాస్, పార్టీ నాయకులు ఆళ్ల శివగణేష్, జి.వి.రమణి, పైడి రమణ, దుప్పలపూడి శ్రీనివాసరావు, కె.పి.రత్నాకర్, బొడ్డేటి గంగామహేష్, ఆళ్ల గోపి, వై సిద్ధార్థ, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, యడ్ల శ్రీనివాసరెడ్డి, ఎండి గౌస్, ఏపీడీ పద్మావతి, సచివాలయ కన్వీనర్లు,గృహసారథులు పాల్గొన్నారు.

మార్మోగిన శివ నామస్మరణ

- ఘనంగా కార్తీక మాస తొలి సోమవారం పూజలు


సీతంపేటలో పార్వతీశ్వరుడికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు


రైల్వే న్యూకాలనీలో శివలింగానికి అభిషేకం

సీతంపేట: కార్తీక మాస తొలి సోమవారం సందర్భంగా నియోజకవర్గంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారు 4 గంటల నుంచే అభిషేకాలు, అర్చనలు, రుద్రహారతులు, భక్తుల శివ నామస్మరణతో ఆలయాలన్నీ మార్మోగాయి. 25వ వార్డు సీతంపేట గణేష్‌నగర్ పార్వతీశ్వరాలయంలో స్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించారు. ఆలయ అర్చకులతో అర్చనలు, అభిషేకాలు, క్షీరాభిషేకాలు జరిపించారు. శివలింగాన్ని చిట్టిబెల్లం, జీడిపప్పుతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, చైర్మన్ నమ్మి పద్మా వెంకట్ స్వామికి తొలి పూజలు చేశారు. మహిళలు ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగించారు. సాయంత్రం మేళతాళాల మధ్య పార్వతీశ్వరుడికి రుద్రహారతులు సమర్పించారు.

- 26వ వార్డు రామకృష్ణానగర్ రామలింగేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు ఉదయాన్నే శివుడికి జల, పంచామృతాభిషేకాలు జరిపారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు రామలింగేశ్వరుడి దర్శించి పూజలు చేసి, దీపాలు వెలిగించారు. ఆలయ ప్రాంగణంలోని ఉసిరి, జమ్మి, మారేడు, నేరేడు చెట్లకు మహిళలు పూజలు చేసి దీపాలు వెలిగించారు. దంపతులు దీప, సాలిగ్రామ దానాలు చేశారు. ఆలయ ఈవో రమాభాయి ఏర్పాట్లు పర్యవేక్షించారు.



నక్కవానిపాలెంలో ఉమానీలకంఠేశ్వరుడిని పూజిస్తున్న భక్తులు

ఆలయ చైర్మన్ బొడ్డేటి కిరణ్‌కుమార్, సభ్యులు అమ్మాజి, రాము, శ్రీదేవి, మార్తాండమూర్తి పాల్గొన్నారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు రామారావు శర్మ, మహేష్ విశిష్ట పూజలు చేశారు. వేకువజాము నుంచి భక్తులు శివుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో శేఖర్ బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

- నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని షిర్డీసాయిబాబా దేవాలయంలో శివకేశవులకు ప్రత్యేక పూజలు చేశారు. గణేష్‌నగర్‌లోని శివపార్వతి సమేత త్రిముఖ విశ్వేశ్వర ఆలయంలో నిర్వహించిన కార్తీక మాస పూజల్లో ఉమానీలకంఠేశ్వరాలయ సిబ్బంది వనజాక్షి, శేఖర్, ట్రస్ట్ చైర్మన్ నక్క అప్పలరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు, అభిషేకాలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42, 45 వార్డుల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. 42వ వార్డు రైల్వే న్యూకాలనీ ఉమానీలకంఠేశ్వరాలయంలో అర్చకుడు బాదంపూడి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. 45వ వార్డు రామచంద్రనగర్, వరాహగిరికాలనీ–2 శివాలయాల్లో విశేష పూజలు చేశారు.

శంభో శంకర

కంచరపాలెం: జీవీఎంసీ 46, 47, 48, 54, 55 వార్డుల్లోని కంచరపాలెం, 104 ఏరియా బాపూజీనగర్, తిక్కవానిపాలెం, ధర్మానగర్, రెడ్డికంచరపాలెం తదితర ప్రాంతాల్లోని శివాలయాల్లో తొలి కార్తీక సోమవారం పూజలు ఘనంగా జరిగాయి.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

డీసీపీ(క్రైం) నాగన్న


ఫోర్త్ టౌన్ క్రైం పోలీస్ స్టేషన్‌లో డీసీపీ నాగన్న

సీతమ్మధార: నేరాలు, దొంగతనాల నియంత్రణకు ప్రతి అపార్ట్‌మెంట్, గ్రూప్ హౌస్, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీసీపీ(క్రైం) నాగన్న సూచించారు. సోమవారం మధ్యాహ్నం ద్వారకా, ఫోర్త్‌టౌన్ క్రైం పోలీస్ స్టేషన్లను ఆయన సందర్శించారు. సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకుని, పాత నేరస్తుల రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా మీడియాతో డీసీపీ మాట్లాడుతూ నగరంలో అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే తెలియజేయలన్నారు. సీఐలు, ఎస్‌ఐలు లాడ్జీల్లో విస్తృతంగా తనిఖీలు చేయాలన్నారు. 2 నుంచి 4 గంటల మధ్య సమయంలో ఎవరు అనుమానాస్పదంగా కనిపిస్తే స్టేషన్‌కు తరలిస్తామని చెప్పారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే వారు ముందుగా సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారమివ్వాలని కోరారు. పెట్రోల్ దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, బంగారు నగలు కనిపించకుండా చూసుకోవాలని సూచించారు. ఆపదలో ఉన్న వారి కోసమే డయల్ 100 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు రాత్రి పూట బళ్లకు నాణ్యమైన లాక్ వేసుకోవాలని సూచించారు. నైట్ బీట్ కానిస్టేబుళ్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏడీసీపీ గంగాధర్, ఎస్‌ఐలు ధర్మేంద్ర, అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

‘స్పందన’కు 20 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 20 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.ఆనంద్‌కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తికి రిమాండ్

సీతమ్మధార: కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని ద్వారకా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సీతంపేట రెల్లి వీధికి చెందిన పి.విశ్వనాథం అనే వ్యక్తి సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేసే పనిచేస్తుంటాడు. ఆదివారం మధ్యాహ్నం టీ తాగేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతానికి వెళ్లి తన ద్విచక్ర వాహనాన్ని పక్కన పార్క్‌చేశాడు. తిరిగి ఇంటికి వెళ్లేందుకు బైక్ తీస్తుండగా.. అదే ప్రాంతానికి చెందిన గంటా రామరాజు తన స్నేహితులతో మద్యం తాగుతున్నాడు. ఇదేంటని ప్రశ్నించిన విశ్వనాథంపై రామరాజు దాడికి దిగాడు. జేబులోని కత్తి తీసి పొడిచేందుకు ప్రయత్నించాడు. దీంతో అక్కడి నుంచి విశ్వనాథం ఇంటికి చేరుకున్నప్పటికీ వదలకుండా ఇంట్లోకి దూరి పొడిచేందుకు చూడగా.. కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. బాధితుడు ద్వారకా పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ధర్మేంద్ర కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. రామరాజు పాత కేసులో నేరస్థుడిగా ఉన్నాడు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

సీతంపేట: విశాఖ పౌర గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు మహమ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో గీత్ సంగీత్ పేరిట సంగీత విభావరి నిర్వహించారు. పలువురు గాయనీ గాయకులు హుషారైన పాటలు పాడి అలరించారు. వారోత్సవాల్లో భాగంగా సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు, పుస్తక ప్రదర్శన, పిల్లలకు, పెద్దలకు క్విజ్, చిత్ర ప్రదర్శన, డ్రాయింగ్, స్టోరీ టెల్లింగ్, కవి సమ్మేళనం, చర్చా గోష్ఠి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ, గ్రంథపాలకురాలు దుర్గారాణి పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జీవీఎంసీ హైస్కూల్ ఉపాధ్యాయిని ఎం.వసంతకుమారి చేతుల మీదుగా బహుమతులు అందించారు. గ్రంథాలయాధికారి వై.పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీచర్ శశికళ, భాస్కర్, సచివాలయం మహిళా పోలీసు భాగ్యశ్రీ, దుర్గమ్మ పాల్గొన్నారు.

వైభవుడి అన్నదాన భవనంలో వివాహాలకు అవకాశం

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణాన్ని ఆనుకుని నిర్మించిన అమ్మ అలవేలు మంగ అన్నదాన భవనంలో వివాహాల నిర్వహణకు అవకాశం ఇస్తున్నట్లు ఈవో బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు 0891–2500388, 86888 38988 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నిరాశ్రయులకు దుస్తుల పంపిణీ


చీర అందిస్తున్న కీర్తి పట్నాయక్

మురళీనగర్: శీతాకాలంలో నిరాశ్రయుల ఇబ్బందులు తీర్చేందుకు శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ వస్త్రాలను పంపిణీ చేసింది. మురళీనగర్ రామాలయం వద్ద మహిళా యాచకులకు చీరలు, నూతన వస్త్రాలు, ఇతర నిరాశ్రయులకు శాలువాలను సంస్థ చైర్‌పర్సన్ కీర్తి పట్నాయక్ అందజేశారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మద్దిలపాలెం: కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట పుట్టబంగారమ్మ గుడి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సోమవారం ఉదయం ఈ ప్రాంతంలోని ఖాళీ స్థలంలో సుమారు 30–40 ఏళ్ల వయసు గల వ్యక్తి మరణించాడు. నీలం రంగు టీ షర్ట్, నీలం, తెలుపు రంగు కలిగిన ట్రాక్ ధరించాడు. మాసిన గడ్డంతో సుమారు 5.5 నుంచి 5.7 అడుగుల ఎత్తు కలిగి ఉన్నాడని, మృతుడి ఆచూకీ తెలిసిన వారు కంచరపాలెం పోలీసులను సంప్రదించాలని కోరారు.

మొబైల్ ఫోన్ కోసం దాడి

మద్దిలపాలెం: మొబైల్ ఫోన్ ఇవ్వలేదని వ్యక్తిని గాయపరచినట్లు కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని పోలీసులు తెలిపారు. సోమవారం రాత్రి చాకలిగెడ్డ ప్రాంత వాసి కేసవరపు సతీష్ మాత్రల కోసం వెళ్తుండగా అదే ప్రాంతానికి చెందిన గౌరీశంకర్ అనే వ్యక్తి దారికాచి మొబైల్ ఫోన్ ఇమ్మని కోరాడు.. తన మొబైల్‌లో బ్యాలెన్స్ లేదని సతీష్ తెలిపగా.. ఆగ్రహించిన గౌరీశంకర్ అతడిని గాయపరిచాడు. కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.